
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 14 ఆగస్టు 2025



శంషాబాద్ : కొత్వాల్‌గూడ ఔటర్‌పై కురుస్తున్న వర్షం



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



టోల్‌ఫ్రీ నంబర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. డ్రగ్స్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. నిషేధిత డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్‌లో స్వర్ణభారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి శిక్షణ ప్రారంభమై 30 రోజుల పాటు కొనసాగుతుందని, 19-45 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అర్హులని తెలిపారు. ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7893121143, 9391487797, 9177141712, 9618534720 సెల్ నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.

డిగ్రీ, పీజీలో స్పాట్ అడ్మిషన్లు

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే తెలిపారు. అడ్మిషన్లకు గురువారం గడువు ముగుస్తుందన్నారు. బీకాం(కంప్యూటర్ సైన్స్), ఎంపీసీ, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంపీసీ, ఐఎంఎస్‌సీ(ఇంటిగ్రేటెడ్ పీజీ)లలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9703441345 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. వరుణుడు అప్పుడప్పుడు గ్యాప్ ఇస్తూ దుమ్మురేపుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వాన దంచికొట్టడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈసీ, మూసీ వాగులు ఉప్పొంగాయి. చెరువులు, చెక్‌డ్యాంలు అలుగు పారుతున్నాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు



ముంచెత్తిన వాన

- చెరువులను తలపించిన రోడ్లు
- కేశంపేట మండలంలో తెగిన కల్వర్టులు
- మామిడిపల్లిలో అత్యధికంగా 93.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



మహేశ్వరం : తుక్కుగూడలో జలమయమైన శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి

జిల్లాలో వర్షపాతం(మి.మీలలో..)

బాలాపూర్ మండలం మామిడిపల్లి	93.5
బాలాపూర్ పరిధి ఎయిర్‌పోర్టు ప్రాంతం	87.0
మహేశ్వరం ఇండస్ట్రియల్ ఏరియా	85.8
శంషాబాద్ మండలం పెద్దషాపూర్	84.5
కందుకూరు మండలం రాచలూరు	81.0



చేవెళ్ల : పత్తి పంటలో వర్షపు నీరు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల/కొత్తూర్/ఇబ్రహీంపట్నం/యాచారం/మొయినాబాద్ రూరల్/శంషాబాద్/మహేశ్వరం/చౌదరిగూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో అత్యధికంగా బాలాపూర్ మండలం మామిడిపల్లి 93.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జోరువానకు కేశంపేట మండలం కాకునూరు లేమామిడి మార్గంలో కల్వర్టు దెబ్బతిన్నది. అలాగే లేమామిడి-నిర్ధవెల్లి గ్రామాల మధ్య మరో కల్వర్టు ధ్వంసమైంది. మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. బీటీ రోడ్లు దెబ్బతిన్నాయి. జోరు వర్షాలకు పొలాల్లోకి నీరు చేరింది.

వర్షపాతం ఇలా..

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో 68.5 మిల్లీమీటర్లు, కొంగరకలాన్‌లో 65.5 మిల్లీమీటర్లు, మహేశ్వరం మండలం అమీర్‌పేటలో 62.3 మిల్లీమీటర్లు, మొయినాబాద్‌లో 59.1 మిల్లీమీటర్లు, మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 49.5 మిల్లీమీటర్లు, రాజేంద్రనగర్ మండలం ఏఆర్ఎస్ వద్ద 47.3 మిల్లీమీటర్లు, మహేశ్వరంలో 47.0 మిల్లీమీటర్లు, మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 44.8 మిల్లీమీటర్లు, శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులో 43.8 మిల్లీమీటర్లు, చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో 39.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా ధారూరులో 68.0 మిల్లీమీటర్ల

మిగతా 8వ పేజీలో...

సొంతింటి కల.. నెరవేరుతున్న వేళ!

- పూర్తికావొస్తున్న ఇందిరమ్మ ఇళ్లు
- అవాంతరాలున్నా వేగంగా నిర్మాణాలు
- చొరవ చూపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి
- షాద్‌నగర్ నియోజకవర్గంలో 3,484 ఇళ్లు మంజూరు

షాద్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. 60గజాల స్థలం ఉన్నవారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.5లక్షలు కూడా అందించేలా చర్యలు తీసుకుంది. షాద్‌నగర్ డివిజన్ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,484 ఇళ్లు మంజూరయ్యాయి. కాగా, వీటిలో 2,477 ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 500ఇళ్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇళ్లు మంజూరైనా కొందరు లబ్ధిదారులు ఇంకా నిర్మాణం మొదలుపెట్టలేదు. ఇప్పటికే 1,220 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామంలో స్వరూప అనే మహిళ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో దీనిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. త్వరలో మిగతావి ప్రారంభించనున్నారు.

ఎన్నో అవాంతరాలు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తేలికగా ముందుకు సాగలేదు. తొలి దశలోనే ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఇసుక కొరత, గ్రానైట్, సిమెంట్ ధరలు విపరీతంగా పెరగడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇసుక, గ్రానైట్ కొరతను తీర్చారు. దాంతో నియోజకవర్గ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు

మిగతా 8వ పేజీలో...



నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో నిర్మాణం పూర్తయిన ఇల్లు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



సొంతింటి కల నిజమవుతుందన్న విషయాన్ని ఇప్పటికీ కూడా నమ్మలేకపోతున్నాం. ఎన్నో ఏండ్ల నుంచి సొంత ఇల్లు కట్టుకోవాలని ఆశిస్తున్నాం. కాని ఇప్పుడు తమ కల సాకారమవుతుంది. సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందిస్తుంది. ముఖ్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా వచ్చి ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తుండటంతో తమకు బిల్లుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావడం లేదు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

– పావని, పులుసు మామిడి, కొందుర్గు మండలం

మైసమ్మ తల్లో.. చల్లంగ చూడమ్మా

- మైసిగండిలో ఘనంగా బోనాలు
- హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



బోనాలతో ర్యాలీగా వస్తున్న మహిళలు

కడ్తాల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండిలో మైసమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుకల్లో వివిధ ప్రాంతాలలో ఉన్న స్థానికులు, వారి బంధువులు, సమీప గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ సిరోలిపంతూ, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ మాదారం శేఖర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బాలయ్యగౌడ్, శ్రీరాములుగౌడ్, పుల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో దేవతకు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనం కుండలను అలంకరించుకొని ర్యాలీగా మైసమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఎంపీడీవో సుజాత, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, బాలయ్యగౌడ్, శ్రీరాములుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదగిరి గౌడ్, సత్యనారాయణ, గణేశ్, నర్సింహ్మ, సత్తయ్య పాల్గొన్నారు.

యాచారంలో తిరంగా ర్యాలీ



యాచారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ ఆదేశం మేరకు బుధవారం యాచారం మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు, పాఠశాలల విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ ద్వారా దేశఖ్యాతి ప్రపంచ దేశాలకు వ్యాపించిందన్నారు. త్రివిధ దళాల గొప్పదనం ప్రతీ పౌరుడు గౌరవించాలని, జాతీయ భావాలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు తాండ్ర రవీందర్, బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, మాజీ సర్పంచ్ ఆర్.విజయ్‌కుమార్, నాయకులు గోగికార్ రమేష్, బూర సందీప్, పాండురంగారెడ్డి, నాగరాజు, యాదయ్య, సత్తిరాజు, పి.శాంతికుమార్ తదితరులున్నారు.

మా డబ్బు ఇప్పించండి!

- డ్వాక్రా పొదుపు సంఘాల మహిళల ఆందోళన
- విచారణ చేపట్టిన అధికారులు

యాచారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) మండలం పరిధి చౌదర్‌పల్లిలోని డ్వాక్రా సంఘాల డబ్బును ఫోర్జరీ సంతకాలతో డ్రా చేయడంపై మహిళల ఆందోళన వీడడం లేదు. బుక్ కీపర్లు, పాత బ్యాంక్ మేనేజర్ ఝాన్సీలను విచారణ చేయాలని, మా డబ్బు ఇచ్చేదాక ఇక్కడి నుంచి కదిలేది లేదని బుధవారం పలువురు మహిళలు ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ మాన్యానాయక్‌ను కోరారు. వారి బ్యాంక్ పాస్ పుస్తకాలను మేనేజర్‌కు అందించి తమ పాస్‌బుక్‌లు అప్‌డేట్ చేయించుకున్నారు. కాగా, ఫోర్జరీ సంతకాలతో డబ్బు డ్రా చేయడంపై ఎస్‌బీఐ అదనపు జనరల్ మేనేజర్ రామకృష్ణయ్య రికార్డులను పరిశీలించారు. ఏయే తేదీన ఎవరెవరు ఎంతమేర డబ్బులు డ్రా చేశారో ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. ఈ అంశంపై యాచారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం రవీందర్‌ను డీఆర్‌డీవో ఏపీడీ లీలారాణి అడిగి తెలుసుకున్నారు. దీని గురించి లీడ్‌బ్యాంక్ మేనేజర్, బ్యాంక్‌ల కంట్రోలర్‌లకు ఫిర్యాదు చేశామని డీఆర్‌డీవో తెలిపారు. డబ్బు రికవరీ చేసి మహిళలకందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు.



బ్యాంక్‌లో డ్వాక్రా సంఘాల మహిళలు

టీచర్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

కొందుర్గు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా

కొందుర్గు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటేషన్‌పై వెళ్లి టీచర్‌ను తిరిగి మా పాఠశాలకు పంపించాలని మండల పరిధిలోని చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. బుధవారం మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. చోటు చేసుకుంది. చెర్కుపల్లి పాఠశాలలో పనిచేస్తున్న సుష్మ రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లింది. దీంతో బడిలో ఉన్న 46 మంది విద్యార్థులకు ఉన్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరిని నార్సింగ్ ప్రాంతానికి పంపిస్తే ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. వెంటనే డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని తిరిగి పంపించాలని ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రీదేవి సెలవులో ఉండడంతో ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారికి సుశీంద్రరావుకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించారు. డీఈవో ఆదేశాల మేరకు కొందుర్గు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్ ఆందోళన చేపడుతున్న ప్రాంతానికి వెళ్లి... పాఠశాలలో ఉపాధ్యాయులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

బీజేపీతోనే దేశాభివృద్ధి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



నారపల్లిలో తిరంగా ర్యాలీలో ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలో బుధవారం బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా జెండా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఈటల మాట్లాడుతూ బీజేపీతోనే దేశం సురక్షితంగా ఉందని, ప్రధాని మోదీ సారథ్యంలో దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, బిక్కు నాయక్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, కాలేరు రామోజీ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మిడి శోభారాణి, మండల అధ్యక్షుడు బసవరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి పోలు భాస్కర్‌గౌడ్, రాజారమేష్, పాల్గొన్నారు. అలాగే పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్ నుంచి నారపల్లి వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి, విక్రంరెడ్డి, బిక్కునాయక్, పాల్గొన్నారు.

మర్పల్లి మండల కేంద్రంలో..

మర్పల్లి: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బసవేశ్వర విగ్రహం వద్దకు చేరుకొని ఆయన మాట్లాడారు. ప్రతీ పౌరుడు దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ సగర్వంగా ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు యాదవ్‌రెడ్డి, శ్రీమంత్‌కుమార్, మహేశ్వరీ,మహేశ్, యాదయ్య, శ్రీకాంత్, మధు, శివ, గణేశ్, నగేశ్, మహేందర్ రెడ్డి, శేఖర్, గోపాల్, సునీల్, సుభాష్, మనోహర్ పాల్గొన్నారు.


మర్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నేడు షాబాద్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

షాబాద్: దేశభక్తిని చాటిచెప్పే హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నేడు(గురువారం) చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశభక్తిని చాటిచెప్పడానికి, త్రివర్ణపతాకానికి వం దనం చేయడానికి బీజేపీ ఆధ్వర్యంలో మహాతిరంగాయాత్రనుషాబాద్‌లో ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మద్దూరి మాణయ్య, హరీష్, శేఖర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేష్, కిరణ్, రవిగౌడ్, నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పింఛన్లు పెంచకపోవడం విచారకరం

● అధికార పార్టీ ఇవ్వదు, ప్రతిపక్ష పార్టీ అడగదు
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

ఘట్‌కేసర్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లను పెంచకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసగిస్తున్నాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. బుధవారం ఘట్‌కేసర్‌లో జరిగిన మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గస్థాయి మహాగర్జన సన్నాహక సదస్సుకు హాజరై మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పేదలను పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీ ఇవ్వదు, ప్రతిపక్ష పార్టీ అడగదు అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ రావడంలో ఎమ్మార్పీఎస్ కృషి ఎంతో ఉందన్నారు. దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు ఇతర పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 3న నగరంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తాండూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాంజాపూర్ గ్రామానికి చెందిన పార్వతమ్మ రెండు నెలల క్రితం గుండెపోటుతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి బుధవారం పార్వతమ్మ కుటుంబానికి రూ.60వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం తమబాధ్యత అన్నారు. శివకుమార్, వీరేశం ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

దోమ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బడెంపల్లి గ్రామంలో ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమానురాలు జ్యోతి మాట్లాడుతూ మహేశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన సహకారంతో తనకు యూనిట్ మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుజనాదామోదర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, కొప్పుల కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, అలీఖాన్‌ల నియామకం రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. తమ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ వ్యతిరేకించడం, ప్రొఫెసర్ కోదండరాం, అలీఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఉద్యమకారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ పిటిషన్ దాఖలు చేయడంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, అలీఖాన్‌ల నియామకం రద్దు చేస్తూ సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.

అగ్రనేతల అరెస్ట్‌పై ఎన్ఎస్‌యూఐ భగ్గు

కడ్తాల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీల అరెస్ట్‌పై కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు భగ్గుమన్నారు. కడ్తాల మండల కేంద్రంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ మండల ఇన్‌చార్జి గంట ప్రవీణ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బస్టాండ్ కూడలిలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్‌లు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. బోసు రవి, పవన్, దర్శన్, క్రాంతి, ఆకాశ్, మహి, విజయ్, ప్రవీణ్‌గౌడ్, చరణ్, శ్రీకాంత్, సందీప్, రమేశ్, నరేశ్, శ్రీను పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కేశంపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేశంపేట మండలాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారులు 24గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఏవో శిరీష, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, పీఆర్ఏఈ నర్సింగ్‌రావు, ఇరిగేషన్ ఏఈ గీత, ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్, ఏపీవో అజీజ్ అహ్మద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దివ్యాసింగ్, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లారెడ్డి

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివితేనే భవిష్యత్తు బాగుంటుందని నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ దివ్యనగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగు కళాశాలలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమయాన్ని వృథా చేసుకోవద్దని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేతిరెడ్డి సంధ్యావళి, డైరెక్టర్ నల్ల దివ్య, కార్యదర్శి నల్ల స్నేహ, ప్రిన్సిపల్ ఎంఎన్‌వీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆది కర్మయోగి అభియాన్‌లో భాగంగా గిరిజనుల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై ఓరియంటేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 31 గ్రామ పంచాయతీల్లో గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. గిరిజనుల అవసరాలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి, డీడబ్ల్యూవో కృష్ణవేణి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవి, చల్మారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు పాల్గొన్నారు.

'అమృత్' పనుల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ డీఈ సాజిద్

తాండూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అమృత్ 2.0 పనుల్లో వేగం పెంచాలని పబ్లిక్ హెల్త్ డీఈ సాజిద్ ఆదేశించారు. బుధవారం తాండూరు పట్టణంలో పూర్తిస్థాయిలో తాగు నీటిని అందించేందుకు రూ.27 కోట్లతో చేపట్టిన పనులను, తాగు నీటి ట్యాంకులు, చిలుక వాగు డ్రైన్ పనులను పరిశీలించారు. రూ.16 కోట్లతో చేపడుతున్న చిలుక వాగు డ్రైన్ నిర్మాణ పనుల వివరాలు తెలుసుకున్నారు. ట్యాంకుల నిర్మాణానికి కావాల్సిన సామగ్రి వెంటనే సరఫరా చేసేలా చూస్తామ న్నారు. ఆయన వెంట ఏఈ ఉదయ్ కుమార్, మున్సిపల్ ఏఈ ఖాజా, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కృష్ణంరాజు

కొడంగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షలో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు చేతుల మీదుగా స్టేట్ టాపర్‌గా నిలిచిన యశ్వంత్‌తో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థులు వరుణ్, రిషి, లక్కీ, శ్రీచరణ్, సాహితి, విశాల, బిలాల్‌కు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద ముంపునకు పరిష్కారం చూపాలి



అధికారులతో చర్చిస్తున్న ప్రత్యేకాధికారి సుదర్శనం

బషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వరద ముంపునకు గురైన జీవన్గి గ్రామం ఎస్సీ కాలనీని మండల ప్రత్యేకాధికారి సుదర్శనం బుధవారం పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సహాయక చర్యలపై ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మాణిక్‌రెడ్డితో చర్చించారు. వరద నుంచి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ షాహీదాబేగం, ఎంపీవో విజయ్‌కుమార్, విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్, ఉపాధిహామీ ఈసీ నర్సింహారెడ్డి, కార్యదర్శి ప్రకాష్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

జీవన్గి ఎస్సీ కాలనీలో వరద ముంపునకు అవస్థలు పడుతున్న బాధిత కుటుంబాలకు బీవీజీ ఫౌండేషన్ చేయూతనందించింది. ఆ సంస్థ ప్రతినిధులను గ్రామానికి పంపించి ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి చేతులమీదుగా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సునీల్‌ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చొరవ చూపాలి

నవాబుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చొరవ చూపాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి అన్నారు. బుధవారం నవాబుపేట మండలంలోని వట్టిమీనపల్లి, నవాబుపేట గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. మొక్కల వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో అనురాధ, ఏపీవో లక్ష్మీదేవి, ఎంపీవో విజయ్‌కుమార్, ఈసీ జ్యోతి, టీఏలు ఉన్నారు.



నర్సరీలో రికార్డును పరిశీలిస్తున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి



మూసి ఉన్న ధారూరు పశు వైద్యశాల, ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి

సైన్ పెట్టి.. ఏంచక్కా డుమ్మా కొట్టి!

ధారూరు పశువైద్యశాల సిబ్బంది తీరు.. చర్యలు తీసుకుంటామన్న జిల్లా పశుసంవర్ధక అధికారి

ధారూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ధారూరు పశు వైద్యశాల వైద్యాధికారి, సిబ్బంది హాజరు రిజిష్టర్‌లో సంతకాలు పెట్టి విధులకు డుమ్మా కొట్టారు. దీంతో పశువైద్యశాలకు తాళం పడింది. పశువులకు వైద్యం చేసేవారు లేక బుధవారం పశువులతో వచ్చిన రైతులు ఎదురుచూసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సదానందం ఆస్పత్రిని తనిఖీ చేశారు. హాజరు రిజిష్టర్‌ను పరిశీలించి ఇన్‌చార్జి పశువైద్యాధికారి కుమారస్వామి, సిబ్బంది సంతకాలు పెట్టి విధులకు డుమ్మా కొట్టినట్టు గుర్తించారు. వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధారూరుకు చెందిన ఓ రైతు ఎద్దుకు వచ్చిన గేదెను, లక్ష్మీనగర్ తండాకు చెందిన మరో రైతు మేకలను వైద్యం చేయించడానికి పశువైద్యశాలకు వచ్చారు. వీరితో పాటు గట్టేపల్లి, రుద్రారం, డీకే తండాకు చెందిన కొంత మంది రైతులు కూడా పశువులకు తీసుకువచ్చారు. అప్పటికే ఇన్‌చార్జి పశు వైద్యాధికారి కుమారస్వామి, సిబ్బంది తాళం వేసి వెళ్లిపోయారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎవరూ రాకపోవటంతో ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు నెలల్లో పూర్తి నివేదిక ఇవ్వాలి

తాండూరు రిజిస్ట్రేషన్ అధికారులకు హైకోర్టు ఆదేశం

తాండూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చించోళి రోడ్డు మార్గంలో సర్వే నం.122లో డబుల్ రిజిస్ట్రేషన్లు, లేని భూమికి జరిగిన క్రయ విక్రయాలపై విచారణ జరిపి రెండు నెలల్లో పూర్తి స్థాయి నివేదికను అందించాలని హైకోర్టు రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది. ఈ స్థలంపై బహుళ యజమాన్య హక్కులు సృష్టించారని, నకిలీ పత్రాలు తయారు చేసి అదనపు భూమిని విక్రయించారని పేర్కొంటూ మద్దెల విజయ్‌కుమార్‌రెడ్డి స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ, కమిషనర్, ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలను కోరాడు. ఈ విషయంలో అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. 3,025 చదరపు గజాల భూమిని అక్రమంగా 3,472 చదరపు గజాలుగా చేసి విక్రయించారని రిట్‌లో పేర్కొన్నారు. సర్వే నం.122లో తమ కుటుంబానికి చెందిన 1200 గజాల స్థలంను కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా పట్టించుకోకుండా తమ స్థలంలో సంజీవరావు అనే వ్యక్తికి అగమేఘాలపై కమిషనర్ అనుమతులు జారీ చేశారని ఆరోపించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు.

రాహుల్‌గాంధీది ఓట్ల రాజకీయ రాద్ధాంతం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారత ప్రధానిగా నరేంద్రమోదీ సాధిస్తున్న విజయాలను చూసి తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఓట్ల చౌర్యం అంటూ రాద్ధాంతం చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు అన్నారు. షాద్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక చాయ్‌వాలాగా జీవితాన్ని ప్రారంభించి, బడుగు బలహీన వర్గాలకు దగ్గరై మూడోసారి ప్రధానిగా విజయాలు సాధిస్తూ, ప్రపంచ ప్రఖ్యాతి గాంచుతుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతున్నదన్నారు. పాకిస్థాన్‌కు, ఆ దేశానికి మద్దతు ఇస్తున్న అమెరికాకు మేలు జరిగేలా రాహుల్ గాంధీ మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని ఆరోపించారు. మోదీని విమర్శించే స్థాయి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు లేదని, నియోజక వర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. భూపాలాచారి, ప్యాట అశోక్, చెట్ల వెంకటేష్, ప్రశాంత్, వంశీకృష్ణ, ఎం.మురళి, హరిభూషన్ పటేల్, పి.ప్రశాంత్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు మహాధర్నా

చేవెళ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేయకుంటే సెప్టెంబరు ఒకటిన పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహాధర్నా చేస్తామని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పీఆర్టీయూ చేవెళ్ల మండలాధ్యక్షుడు పడాల దయానందం, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో చేవెళ్ల మండలంలోని చేవెళ్ల, మల్కాపూర్, గుండాల, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబరు 1న ఇందిరాపార్క్ వద్ద పదివేల మందితో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నాయకత్వంలో మహాధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంఈవో పురందాస్, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ధారూరులో మీసేవ కేంద్రం సీజ్

ధారూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ధారూరులోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తుదారుల నుంచి అధిక రుసుము వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదు పై తహసీల్దార్ సాజిదా బేగం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఐ దేవేందర్‌రెడ్డి బుధవారం మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి విచారణ జరిపారు. దరఖాస్తుదారుల నుంచి నిర్వాహకులు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ఆర్ఐ మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేసి విచారణ నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

శంకర్‌పల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. శంకర్‌పల్లి పట్టణంలోని అతిథిగృహంలో బుధవారం సీపీఐ మండల కార్యదర్శి సుధీర్ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. సీపీఐ వందేళ్ల వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్‌లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రభులింగం, సత్యనారాయణ, మంజుల, మల్లేషం, జంగయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

వైఫల్యాలను ఎత్తిచూపితే
తట్టుకోలేకపోతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

● ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

ఆమనగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హామీల అమలు, ప్రజా సమస్యలను ప్రజల పక్షాన, విపక్ష పార్టీ నాయకుడిగా తాను ప్రస్తావించడం తప్పేంటని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ప్రశ్నించారు. అధికార పార్టీలో ఉండి అభివృద్ధి సాధించలేకపోయిన ఎమ్మెల్యే కసిరెడ్డి తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆచారి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 20 నెలలు కావొస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకుముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే కసిరెడ్డి పట్టించుకోవడం లేదని, ప్రశ్నిస్తే తనకు సంస్కారం లేదని, సహనం కోల్పోయి మాట్లాడుతున్నానని పేర్కొనడం సరికాదన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో మెరుగైన తాగునీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రెండేళ్ల క్రితం రూ.32 కోట్లు మంజూరుచేస్తే సకాలంలో పనులు చేపట్టకుండా ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఆమనగల్లులో పాలిటెక్నిక్ కళాశాల ఎందుకు ప్రారంభించలేదని, రూ.10కోట్లతో వృత్తి నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించి ఏడాదైనా ఏర్పాటుకు కసిరెడ్డి ఏనాడూ చొరవ తీసుకోలేదన్నారు. తమ గ్రామం ఖానాపూర్‌కు డబుల్ రోడ్డు వేయించుకున్న కసిరెడ్డికి జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి పాడైన రోడ్డుపై ప్రజలు పడుతున్న కష్టాలు కనబడడం లేదా? అని ప్రశ్నించారు. ఆమనగల్లు మండలంలోని పోలెపల్లి-ఆకుతోటపల్లి, ముద్విన్-ఆకుతోటపల్లి, కర్కల్‌పహాడ్- చరికొండ, పోలెపల్లి రోడ్లు చేపట్టడానికి చేతులు రాలేదా అని మనసొప్పలేదా అని అన్నారు. కండె హరిప్రసాద్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, బీజేపీ కడ్తాల మండలాధ్యక్షుడు మహేశ్, పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సబితారెడ్డి


మహేశ్వరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని పట్టించిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం నాగారం ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తీరు, విద్యాబోధన, గదులు, టాయిలెట్స్ తదితర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాగారం ఒక్క పాఠశాలనే కాదు.. రాష్ట్రం మొత్తం విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని అన్నారు. నాగారం పాఠశాలలో విద్యార్థులు కూర్చోవడానికి తగిన ఫర్నీచర్ ఉండగా.. నేలపై ఎందుకు కూర్చోబెడుతున్నారని మండిపడ్డారు. పాండుయాదవ్,వెంకటేశ్వర్‌రెడ్డి, రాజునాయక్, లింగం, డి.శ్రీనివాస్, నవీన్, జాన్‌రెడ్డి, కె.ప్రభాకర్, లతీఫ్‌ఖాన్, ఎం.రాఘవేందర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

16 నుంచి కేవీపీఎస్ బస్తీబాట

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 16 నుంచి 30 వరకు దళిత బస్తీల్లో సమస్యలు తెలుసుకునేందుకు బస్తీబాట కార్యక్రమం చేపడుతున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.సామేల్, ఎం.ప్రకాశ్‌కారత్‌లు తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో కేవీపీఎస్ జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేటికీ గ్రామాల్లో అంటరానితనం, కుల వివక్ష కొనసాగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నాయకులు మనోహర్, వెంకటేష్, ఆనంద్ తదితరులున్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పరిగి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పరిగి పట్టణ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సోమరాము, ముకుంద నాగేశ్వర్ కోరారు. వినాయక ఉత్సవాలపై బుధవారం లక్ష్మీనరసింహాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 27న వినాయకచవితి ఉందని, నిమజ్జనం సెప్టెంబర్ ఆరున నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్పీ బాబయ్య, జి.అశోక్, ప్రవీణ్, పెంటయ్య, టి.విజయ్‌కుమార్, బి.రాంచందర్, డి.శ్రీశైలం, బాలకిష్టారెడ్డి, రాజు, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్ద బాధితులు

భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించాలి

చేవెళ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామంలో గల సర్వేనెంబర్ 96లో భూములు కోల్పోతున్న రైతులకు వెంటనే పరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మోకిలలోని రైతుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని హెచ్ఎండీఏకు అప్పగించింది. అయితే, అందులో ఖరీజు ఖాతా కలిగిన కొంతమంది రైతులకు ప్రభుత్వం 600 గజాల స్థలం ఇచ్చింది. అదే ఖరీజు ఖాతా కలిగిన మిగతా 30 మంది రైతులకు ఎటువంటి పరిహారం ఇవ్వలేదని బాధిత రైతులు తెలిపారు. ఈమేరకు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చంద్రకళను కలిసి వినతిపత్రం అందించారు. తమకు న్యాయం చేయాలని ఆర్డీవోను కోరారు. సానుకూలంగా స్పందించి భూములకు సంబంధించిన పత్రాలు సమర్పిస్తే విచారణ చేసి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారని రైతులు పేర్కొన్నారు. ఎర్రోళ్ల శివయ్య, నరేంద్ర, కృష్ణ, శివశంకర్, నర్సింలు, శ్రీమంత్, పోచమ్మ, లక్ష్మయ్య, అశోక్ ఉన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



బాలకిష్టారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థిని

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్యజ్యోతి): విద్యార్థులు, యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఇంజనీరింగ్ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధి ఎన్కేపల్లి రెవెన్యూలోని జేబీఐఈటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు ఓరియెంటేషన్‌డే కార్యక్రమం బుధవారం క్యాంపస్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇన్నోవేషన్, టెక్నాలజీ, స్టార్టప్ వంటి రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు.జేబీ విద్యాసంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో చదివినవారు నేడు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. నగరంలోని ఇస్కాన్‌టెంపుల్ ప్రతినిధి సోనార్ గౌరంగాదాస్, జేబీ విద్యాసంస్థల డైరెక్టర్ సంజయ్, ప్రిన్సిపాళ్లు కృష్ణమాచారి, సుమగ్న పట్నాయక్, డీన్‌లు, హెచ్ఓడీలు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులతో మా విద్యా సంస్థను ర్యాగింగ్ ముక్త క్యాంపస్‌గా నిలబెడతామంటూ ర్యాగింగ్‌కు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.


బ్రహ్మకమలానికి పూజలు చేస్తున్న సంతోష్‌చారి కుటుంబ సభ్యులు

వికసించిన బ్రహ్మకమలం

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్యజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో మంగళవారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. చిలుకూరు గ్రామానికి చెందిన రాంపల్లి సంతోష్‌చారి కుటుంబ సభ్యులు ఇంట్లో అనేక రకాల పూల మొక్కలు, పండ్ల చెట్లు పెంచుతున్నారు. ఈమేరకు మంగళవారం రాత్రి బ్రహ్మకమలం విరబూసింది. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. బ్రహ్మకమలానికి సంతోష్‌చారి కుటుంబ సభ్యులు పూజలు చేశారు.

గణితంలో మెలకువలు నేర్చుకోవాలి


బుక్స్ అందజేస్తున్న వాసుదేవరావు

చౌదరిగూడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణితంలో మెలకువలు నేర్చుకోవాలని విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 300 మంది విద్యార్థులకు గణితం వర్క్‌బుక్స్‌ను అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తుందన్నారు. టెన్త్ ఫలితాల్లో 9 గ్రేడ్ (జీపీఏ) సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో ల్యాబ్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ముంచెత్తిన వాన

(ఐదో పేజీ తరువాయి)

వర్షపాతం నమోదు కాగా దోమలో 64.3 మిల్లిమీటరు, వికారాబాద్‌లో 56.3 మిల్లిమీటర్లు, పరిగిలో 54.0 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదైంది. పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్‌లో 49.8 మిల్లిమీటర్లు, మద్గుల్ చిట్టంపల్లిలో 43.3 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.


మొయినాబాద్ రూరల్ : హిమాయత్ నగర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు

జిల్లావ్యాప్తంగా..

చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామాల్లోని పంట పొల్లాల్లో వర్షం నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాగులు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. దేవరంపల్లి వాగు నిండుగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. అలాగే శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లోని మూసీ, ఈసీ వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తూర్ మండలంలో 40వరకు ఉన్న చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. గూడూర్ గ్రామంలోని రామయ్య చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా, రేపోమాపో గేట్ల ద్వారా నీటిని కిందికి వదిలే అవకాశం ఉంది. కొత్తూర్ సమీపంలోని కాశనకుంట చెరువు, గుడూర్ సమీపంలోని చింతల్‌చెరువు, ఉప్పరవానికుంట శేరిగూడబద్రాయపల్లి గ్రామ శివారులో బేస్తావానికుంట అలుగులు పారుతున్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. యాచారం మండలంలోని యాచారం, గున్‌గల్, గడ్డమల్లాయియాగూడ, చౌదర్‌పల్లి, మల్, మేడిపల్లి, కుర్మిద్ద తదితర గ్రామాలలో గంట పాటు భారీ వర్షం కురిసింది. రహదారి జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో కురిసిన వర్షానికి హిమాయత్ నగర్ చౌరస్తా జలమయమైంది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పూర్తిగా జలమయమై వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. శంషాబాద్ మున్సిపాలిటీలో జోరువాన కురిసింది. హైదరాబాద్ - బెంగుళూరు జాతీయ రహదారి తోపాటు మధురానగర్, ఆర్బీనగర్, ఆదర్శ్‌నగర్, ఇందిరానగర్, సిద్దేశ్వరకాలనీ లకు వెళ్లే రోడ్లన్నీ జలమయమయ్యాయి. మహేశ్వరం మండలంలో కురిసిన భారీ వర్షానికి తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారి తుక్కుగూడ ఫ్లైఓవర్ నుంచి ఇమాంగూడ వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు శ్రీశైలం వైపు.. ఇటు హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో చిన్న గోల్కొండ ఫ్లైఓవర్ నుంచి బొంగులూరు గేటు మీదుగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. చౌదరిగూడ మండలంలో వర్షం దంచి కొట్టింది. తుమ్మలపల్లిలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకూడదని తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. వాగులు దాటేందుకు ఎవరూ ప్రయత్నించొద్దని సూచించారు.


కొత్తూర్ : నిండు కుండలా గూడూర్ రామయ్య చెరువు


చేవెళ్ల : నిండుగా ప్రవహిస్తున్న దేవరంపల్లి వాగు

భారీ వర్షం ఉన్న చోట సెలవు

జిల్లాలో ఎక్కడైతే భారీ వర్షం ఉండి సమస్య ఉన్న చోట సెలవు ప్రకటించుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు హెడ్‌మాస్టర్లకు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాలు, రాకపోకలకు ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించుకోవాలని ఆయన తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలి బూడిదైన వస్తువులు

మహేశ్వరం : షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు కాలి బూడిదైన ఘటన మండల పరిధిలోని తుమ్మలూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కె.రమాదేవి(28) తన ఇద్దరు కూతుళ్లతో తనకున్న చిన్న ఇంట్లో నివాసం ఉంటోంది. భారీ వర్షాల కారణంగా మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో టీవీ, ఫ్రిడ్జ్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు బట్టలు, అల్మారా, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. రమాదేవి రెవెన్యూ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరింది.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై బుధవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి ఒకరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు 40-45 సంవత్సరాలుంటుంది. హైదరాబాద్ వెళ్లేదారిలో ఉదయం 4.45 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. కాగా, వాహనం ఏద్రై ఉంటుందనేది ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు దాటుతుండగా జింక..

యాచారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై గున్‌గల్ రిజర్వ్ ఫారెస్టులో బుధవారం జింక రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మరణించింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు జింక మృతదేహాన్ని ఖననం చేశారు. కాగా, అడవిలో వాహనాలు తక్కువ వేగంతో నడపాలని అటవీశాఖ అధికారులు వాహనాదారులకు సూచించారు.

రెండు పాడిగేదెల అపహరణ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి పోల్కంపల్లి పంచాయతీ జాజోనిబావి వద్ద మంగళవారం రాత్రి ఓ రైతు డెయిరీఫాం నుంచి గుర్తుతెలియని దుండగులు రెండు పాడి గేదెలను అపహరించుకుపోయారు. రైతు కసరమోని ఐలయ్య తన డెయిరీఫాం వద్ద గదిలో నిద్రిస్తుండగా బయట డోరు తాళం పెట్టిన దుండగులు అనంతరం గేదెలను అపహరించుకుపోయారు. వాటి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చింతపట్లలో 11 మేకలు..

యాచారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దొడ్డిలో కట్టేసిన 11 మేకలు అపహరణకు గురైన ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధి చింతపట్లలో చోటుచేసుకుంది. చింతపట్లకు చెందిన ఎండీ బషీర్ తనకున్న 11మేకలను మంగళవారం రాత్రి ఇంటి ముందున్న దొడ్డిలో కట్టేసి నిద్రించాడు. బుధవారం ఉదయం దొడ్డిలోకి వెళ్లిచూడగా మేకలు అపహరణకు గురైనట్లు నిర్ధారించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు

ఆరు ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

కడ్తాల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్విన్ గ్రామంలో అక్రమంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తయారు చేస్తుండగా.. ఆరు ఫిల్టర్లను ధ్వంసం చేసినట్లు సీఐ గంగాదర్ తెలిపారు. ట్రాక్టర్, జేసీబీలను స్వాధీనం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బాల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రాములు, రెవెన్యూ సిబ్బంది శ్రీను, విజేందర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

24 గంటల్లో కేసును ఛేదించిన పీసీకి రివార్డు

కడ్తాల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన కేసును కడ్తాల పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా 24గంటల్లో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించిన పోలీసు కానిస్టేబుల్ రాజశేఖర్‌ను సీఐ గంగాధర్ అభినందించారు. ఈనెల 8న నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు గ్రామానికి చెందిన శివకృష్ణ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. కడ్తాల రాఘవేందర్ హోటల్ సమీపంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసు కానిస్టేబుల్ రాజశేఖర్ ప్రమాదానికి కారణమైన వాహనం, వ్యక్తిని గుర్తించాడు. ఈమేరకు కానిస్టేబుల్ రాజశేఖర్‌ను బుధవారం సీఐ గంగాదర్, ఎస్ఐ లు వరప్రసాద్, చంద్రశేఖర్ లు అభినందించారు. రూ. 5 వేలు క్యాష్ రివార్డు అందజేశారు.

మైసిగండి ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

ఆమనగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఖ్యాతిగాంచిన మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా, దర్శనీయ స్థలంగా తీర్చిదిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దేవాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే సందర్శించారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్‌లతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలతలు ఎమ్మెల్యేను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసిగండి ఆలయ అభివృద్ధికి పర్యాటక శాఖ ద్వారా రూ.5 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. మైసమ్మ ఆలయ అభివృద్ధికి నిధుల కేటాయింపు గురించి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవిస్తామని తెలిపారు. తహసీల్దార్ ఆర్బీ జ్యోతి, నాయకులు జవహర్‌లాల్ నాయక్, తులసీరామ్ నాయక్, హీరాసింగ్, కిషన్, భాస్కర్, గణేశ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.


పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు నిర్మాణాలను పరిశీలించి పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నాయకులు జంగోజీ, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, బాబా, సూదిని కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, నరేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, నరేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

చౌదరిగూడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన నీల నర్సింహులు విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. హెచ్ఎం మంజుభార్గవి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.4కోట్లతో బీసీ వసతి గృహ భవన నిర్మాణం

- నేడు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలచే శంకుస్థాపన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్, డీడీ కేశురామ్ నాయక్

ఆమనగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో బీసీ ప్రభుత్వ బాలుర వసతి గృహ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో మాడ్గుల రోడ్డులో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకోవడం, వసతి గృహాన్ని ఎత్తివేయడంతో పాత భవనాన్ని ఇటీవల తొలగించారు. దాని స్థానంలో 18 గుంటల స్థలంలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు చర్యలు చేపట్టారు. బీసీ బాలుర వసతి గృహ భవనం నిర్మించి ప్రభుత్వం ద్వారా అందులో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధుల నుంచి భవన నిర్మాణానికి అరబిందో ఫార్మసీ రూ.4 కోట్లు కేటాయించినట్లు ఎంపీ రవి తెలిపారు. భవన నిర్మాణానికి ఇప్పటికే స్థలాన్ని సిద్ధం చేశారు. నేడు(గురువారం) ఉదయం 9 గంటలకు భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డిలు తెలిపారు. శంకుస్థాపన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, బీసీ సంక్షేమ శాఖ డీడీ కేశురామ్ నాయక్‌లు పరిశీలించారు. కలెక్టర్ నారాయణ రెడ్డికి కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేసినట్లు కేశవులు తెలిపారు. మున్సిపాలిటీ, మండల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యలు కోరారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌అలవాటు వల్ల జీవితాలు నిర్వీర్యమవుతాయని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చటాన్‌పల్లి శివారులో ఉన్న గిరిజన బాలికల గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం టీచర్లు, విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

చదువుపై దృష్టి సారించాలి

మహేశ్వరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగి రమేష్ అన్నారు. బుధవారం కళాశాలలో మాదక ద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

నాయకుడి ఉదారత.. తాగునీటి బోరు ఏర్పాటు

కొత్తూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల బీసీ కాలనీలో మంచినీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి సిద్ధార్థరెడ్డి సొంత నిధులతో బోరు వేయించి, మోటారు బిగింపజేసి ఉదారతను చాటుకున్నాడు. బుధవారం బోరుమోటార్‌ను సిద్ధార్థరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


బోరును ప్రారంభిస్తున్న సిద్ధార్థరెడ్డి

అందుబాటులో ఎరువులు

శంషాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌లో రైతులకు సబ్సిడీపై ఎరువుల విక్రయాలు ప్రారంభించినట్లు చైర్మన్ ముద్దం మల్లారెడ్డి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌లో బుధవారం ఆయన యూరియా అమ్మకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూరియా బస్తాను సబ్సిడీపోను రూ.266లకు అమ్ముతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ నాయకురాలు మైలారం సులోచన, సిబ్బంది అర్జున్ రైతులు పాల్గొన్నారు.


శంషాబాద్ పీఏసీఎస్ గోడౌన్‌లో ఎరువుల విక్రయాలను ప్రారంభిస్తున్న చైర్మన్ మల్లారెడ్డి

సొంతింటి కల.. నెరవేరుతున్న వేళ!

(ఐదో పేజీ తరువాయి)

ఊపందుకున్నాయి. ఇకపోతే ఇళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని ప్రతీ సోమవారం అధికారులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. కానీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు మాత్రం బిల్లులను నిలిపివేశారు. 60 గజాలకు మించి ఇంటి నిర్మాణం చేపట్టినవారి బిల్లులను ప్రభుత్వం నిలిపివేపింది.

మరో రెండు నెలల్లో నిర్మాణాలు పూర్తి

నియోజకవర్గానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు మరో రెండు నెలలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. నందిగామ, కొత్తూరు, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో ఇప్పటికే 80 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. సొంతింటి కల నెరవేరబోతున్న నేపథ్యంలో గ్రామాల్లోని మహిళల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జిల్లాలో షాద్‌నగర్ నియోజకవర్గం ముందుందని అధికారులు తెలిపారు.

15వేల మందికి ఇళ్లు ఇస్తాం



వచ్చే మూడేళ్లలో 15వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుకుండా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇళ్లను మరో రెండు నెలలో పూర్తి కానున్నాయి. అనంతరం అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు అందేలా కృషి చేస్తా.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం


ఆర్థిక సాయం అందజేస్తున్న కాడేమోని శ్రీశైలం

తలకొండపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం అన్నారు. దేవుని పడకల్‌కు చెందిన జంగయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని శ్రీశైలం పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.4వేలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ.3 వేలు, కాడేమోని శ్రీశైలం రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు అంబటి జంగయ్య, భిక్షపతి, నవీన్, రమేశ్, కృష్ణయ్య, సత్తయ్య, మల్లేశ్, సుమన్ తదితరులున్నారు.

'కోదండరామ్‌పై బీఆర్ఎస్ కుట్రలు, కుతంత్రాలు'

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష, అరవైయేండ్ల నిరీక్షణ, మా తెలంగాణ మాగ్గావలె అని ఊరూవాడను ఒక్కటి చేసి సబ్బండ వర్గాలను ఏకం చేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరామ్‌పై బీఆర్ఎస్ నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేయడం విడ్డూరంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి ఊతం పోసిన కోదండరామ్‌పై బీఆర్ఎస్ అధిష్టానం పన్నని కుట్రలు లేవని, ఆడని డ్రామాలు లేవని అన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవిపై బీఆర్ఎస్ నాయకులు చేసిన కుట్రలు రాష్ట్ర ప్రజలు గుర్తిస్తారన్నారు. జేఏసీ చైర్మన్‌గా ఆయన కీలక భూమిక పోషించాడని గుర్తుచేశారు.

సీసీ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే


కోర్టు ఆవరణలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు సముదాయంలో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బుధవారం పరిశీలించారు. కోర్టు సముదాయంలో సీసీ రోడ్డును వేయించాలని బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు బృందం ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే రూ.10లక్షలు మంజూరు చేయించి, నిర్మాణ పనులను పూర్తి చేయించారు. పనులు పూర్తికాగానే ఆయన ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. మాట ప్రకారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయించిన ఎమ్మెల్యేకు బార్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గనూరి విశ్వం, కృష్ణారెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఎం.శ్రీశైలంగౌడ్, రాజేందర్‌రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు క్రీడాపోటీలు


క్రీడలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి కాటం స్వరూప

ఆమనగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పరుగు పందెం, క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర దిన వేడుకలను పురస్కరించుకొని స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద న్యాయవాదులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్‌తో కలిసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప పోటీలను ప్రారంభించారు. పరుగు పందెం, క్రికెట్, క్యారమ్, చెస్ పోటీలలో న్యాయ వాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆగస్టు 15న విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు యాదిలాల్ పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి కృష్ణ, సభ్యులు, న్యాయవాదులు గణేశ్, జానకిరామ్‌యాదవ్, మల్లేశ్, సంతోష్, సర్దార్, శ్రీనివాస్, మధు, శ్రీశైలం, మల్లేశ్, సూపరింటెండెంట్ మురళీధర్, సిబ్బంది ఉన్నారు.

రాయపోల్ మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి మృతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపోల్ మాజీ సర్పంచ్ గోదల లక్ష్మారెడ్డి(75) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన 1988-95 మధ్య రాయపోల్ సర్పంచ్‌గా పనిచేశారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో పనిచేసిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు భార్య నిర్మల, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడున్నారు. లక్ష్మారెడ్డి మృతిపట్ల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి సంతాపం ప్రకటించారు. అంత్యక్రియలు నేడు(గురువారం) స్వగ్రామంలో నిర్వహిస్తారు.